నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | NAGARKURNOOL




శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మహమూద్‌అలీ, రాజ్యసభ సభ్యులు దామోదర్‌రావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి

శ్వేతారెడ్డికి నివాళి

- లక్ష్మారెడ్డిని పరామర్శించిన కేటీఆర్, హరీశ్‌రావు
- దశదినకర్మకు హాజరైన మాజీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా ఆవంచలో గురువారం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా రెడ్డి ఏకాదశదినకర్మలో పలువురు నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్‌రావు గురువారం గ్రామానికి చేరుకొని శ్వేతా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మారెడ్డిని పరామర్శించారు. వారితో పాటుమాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, బాల్క సుమన్, రవీందర్‌రావు, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీలు మందా జగన్నాథ్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్, రజినీసాయిచంద్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదిరులు శ్వేతా రెడ్డికి నివాళులర్పించారు. ముఖ్య నేతల రాకతో స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి
- జోగుళాంబ గద్వాల జిల్లా అధికారులతో సమీక్ష

గద్వాల, సెప్టెంబర్ 19 : ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జోగుళాంబ గద్వాల కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్, రెవెన్యూ అధికారులతో గురువారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో ఇంటింటి సర్వే కీలకమని, సర్వేను బూత్‌లెవల్ అధికారుల ద్వారా నిర్విరామంగా చేపట్టాలని సూచించారు. ఈ సర్వేలో కొత్త ఓటర్ల నమోదు, ఫొటో మార్పులు, చిరునామా సవరణలు ఇతర సవరణలు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. తాసీల్దార్లు తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారుల పని తీరును క్షేత్ర స్థాయిలోఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఫారం-6 నుంచి ఫారం-8 ద్వారా మరణించిన వ్యక్తుల వివరాలు సేకరించి ఓటరు జాబితా నుంచి వారి పేర్లు తొలగించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహించాలని, డ్రాఫ్ట్‌ఫొటో జాబితా విడుదల చేయాలన్నారు. అన్ని మండలాల్లో స్వీప్ ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 18ఏండ్లు నిండిన యువతను ఓటరుగా నమోదు చేయించాలన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించాలని ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఒంటిమామిడి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లోని బూత్‌లెవల్ అధికారుల ఇంటింటి సర్వే పనులను కలెక్టర్ సంతోష్‌తో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్లను జాబితాలో నమోదు చేయడం, మృతిచెందిన వారి పేర్లు తొలగించడం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం నుంచి ఓటర్ల ఇండ్లకు ఎంత దూరం ఉందో తెలుసుకొని ఓటర్లు సులభంగా చేరుకునేలా సమీప ఎన్నికల కేంద్రాలను కేటాయించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మూడు ఈవీఎం గోదాంలను కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. గద్వాల కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం గోదాం, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల వద్ద ఉన్న ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థను తనిఖీ చేసి దాని పని తీరు పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాసరావు, ఆర్డీవో రాంచందర్, తాసీల్దార్లు, బీఎల్‌ఓలు ఉన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

- మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ

నారాయణపేట, సెప్టెంబర్ 19 : జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా బుధవారం రాత్రి జెండాలు కట్టడంలో జరిగిన వివాదంలో రెండు వర్గాలు ఘర్షణ పడి రాళ్లు విసురుకున్నారని, ఎస్పీ యోగేశ్ గౌతమ్ సిబ్బందితో కలిసి అల్లరి మూకలను చెదర గొట్టాలని వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటమన్నారు. మత పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టామన్నారు. జిల్లా కేంద్రంలో ప్రజల భద్రతపై భరోసా కల్పించేందుకు ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోగుళాంబ జోన్ 7 డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్, ఎస్పీ యోగేశ్ గౌతమ్, నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్, టీఎస్ ఎస్ఓఏ అదనపు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ లింగయ్య పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, అఖిలపక్షం నాయకులు

ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలి

- 'న్యూలైఫ్' అనుమతులను రద్దుచేయాలి
- రెడ్డిసేవా సమితి, అఖిలపక్షం నేతల డిమాండ్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 19 : వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన న్యూలైఫ్ దవాఖాన ఆర్ఎంపీ సమీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం దవాఖాన ఎదుట రెడ్డి సేవాసమితి, అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. దవాఖాన అనుమతులను రద్దు చేయాలని, ఆర్ఎంపీగా ఉండి ఆపరేషన్లు నిర్వహిస్తున్నా ఉన్న తాధికారులు పట్టించుకోకపోవడంపై వారు మండిపడ్డారు. కీచక ఆర్ఎంపీపై ఫోక్సో చట్టం కింద అరెస్టు చేయాలని, దవాఖానను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏదైనా ఘటన జరిగితే వారికి డబ్బులు వెలకట్టి కేసులుకాకుండా మధ్యవర్తుల సాయం పొందుతాడని ఆరోపించారు. చివరకు సీఐ కనకయ్య దవాఖానను మూసివేయించడంతో ఆందోళన విరమింపజేశారు. అనంతరం సీఐ కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఆరోగ్యమిత్రలు

ఆరోగ్యమిత్రల నిరసన

- సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తాం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 19 : తమ సమస్యలను పరిష్కరించకుంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తాయని ఆరోగ్య మిత్రలు హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట గురువారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. చాలా కాలంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించకునే వారు లేరని జిల్లా గౌరవ అధ్యక్షుడు బంగారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆరోగ్య మిత్రల కేడర్ పేరును డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా మార్చాలని కోరారు.

అడ్డాకుల పోలీస్‌స్టేషన్ ఎదుట అరెస్ట్ అయిన నాయకులతో పోలీసులు

నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్ వద్ద నినాదిస్తున్న బీఆర్ఎస్ నేతలు

అరెస్టుల పర్వం

బీఆర్ఎస్ నేతలపై నిర్బంధకాండ

- చలో ప్రజా భవన్‌కు వెళ్లకుండా అడ్డగింత
- రైతులకు మద్దతిస్తారని ముందస్తు చర్యలు
- అర్ధరాత్రి నుంచే పోలీసుల అదుపులోకి..
- ఇండ్ల నుంచి బలవంతంగా పీఎస్‌లకు తరలింపు
- ఠాణాల్లోనే నిరసనలు తెలిపిన నాయకులు
- ఇదేం జులుం అంటూ శ్రేణుల నిలదీత

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని బీఆర్ఎస్ నేతలపై సర్కారు మరోసారి ఉక్కుపాదం మోపింది. బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లకుండా అడుగడుగునా అడ్డుకున్నది. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్న డిమాండ్‌తో గురువారం రైతులు తలపెట్టిన 'చలో ప్రజాభవన్'కు వెళ్లకుండా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. కర్షకులకు మద్దతిచ్చేందుకు వెళ్తారన్న సమాచారంతో పలువురు నేతలను ఎక్కడికక్కడ నిర్బంధించారు. కొందరిని బుధవారం రాత్రి.. మరి కొందరిని గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఇండ్ల వద్దకు వెళ్లి వాహనాల్లో బలవంతంగా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దీంతో గులాబీ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఠాణాల వద్దే పలువురు నిరసనలు తెలిపారు. ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదించారు. రుణమాఫీ కాలేదని రైతులు గగ్గోలు పెడుతుంటే సర్కారుకు చీమకుట్టినట్లు కూడా లేదని ధ్వజమెత్తారు.

- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19

కోస్గి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు

కేటీఆర్ అంటే జూపల్లికి భయం : బీరం

కొల్లాపూర్, సెప్టెంబర్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అరాచకాలపై స్పందిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంటే మంత్రి జూపల్లికి భయమని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. రెండ్రోజుల కిందట తమకు న్యాయం చేయాలని జటప్రోల్ గ్రామ దళితులు వెళితే వారి పై మంత్రి దురుసుగా ప్రవర్తించినట్లు వార్తలు వచ్చాయన్నారు. దీంతో దళితులకు జరుగుతున్న అన్యాయంపై కేటీఆర్ స్పందించారని, ఇందులో తప్పేముందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అసైన్‌మెంట్ భూములకు పట్టా ఇస్తామని చెప్పి.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక దళితుల భూములను బలవంతంగా తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళితులను బెదిరించడమే ఇందిరమ్మ రాజ్యమా వస్తుందా..? అని నిలదీశారు. వెంటనే బాధితులకు న్యాయం చేయడంతో పాటు దళితుల పక్షాన నిలిచిన కేటీఆర్‌పై తప్పుడు విమర్శలను ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరించారు.

వ్యక్తి దారుణ హత్య

పర్వతాలు (ఫైల్)

బాలానగర్, సెప్టెంబర్ 19 : గొంతుకోసి వ్యక్తిని హత్య చేసిన ఘటన బాలానగర్ మండలం పెద్దాయపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన వడ్డె పర్వతాలు(35) పెద్దాయపల్లి స్టేజి వద్ద టీ షాపు నడుపుతుండేవాడు. ఈ క్రమంలో రాత్రి 10గంటల సమయంలో పెద్దాయపల్లి స్టేజికి కొంత దూరంలో ఉన్న క్రీడా ప్రాంగణం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు పర్వతాలు గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. పదిని విషాల ముందు భార్య అనసూయ ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పిన పర్వతాలు ఎంతకూ రాకపోవడంతో తిరిగి ఆమె ఫోన్‌చేసింది. ఎంతకీ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానంతో భార్య కొందరు యువకులను తీసుకొని టీ షాపు వద్దకు వచ్చి వెతికారు. చుట్టుపక్కల పరిశీలించగా రక్తపు మడుగులో పర్వతాలు మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, బాలానగర్, రాజాపూల్ ఎస్సైలు తిరుపాజీ, రవి ఘటనా స్థలానికి చేరుకున్న ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో నేర పరిశోధన చేశారు. మృత దేహాన్ని జడ్చర్ల దవాఖానకు తరలించారు. గురువారం ఉదయం ఎస్పీ జానకి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

లెక్క తేలేనా?

- ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు
- తప్పుల సవరణకు రేపటి వరకు అవకాశం
- 28న తుది జాబితా..

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 19 : రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు రిజర్వేషన్ల విషయం ఇంకా తేల్చనప్పటికీ ఎన్నికల సంఘం మాత్రం ముందస్తు కార్యాచరణను పూర్తి చేస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 13వ తేదీన ఓటరు ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచిన అధికారులు ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. జాబితాలో ఏమైనా పొరపాట్లుఉంటే పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని సూచిస్తున్నారు. ఈ నెల 26వ తేదీ నాటికి అభ్యంతరాలను పరిష్కరిస్తారు. గ్రామాల్లోని ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరినీ ఒకే వార్డులో చేర్చడం, జాబితాలో తప్పులను సరిచేసి షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీన తుది జాబితాను విడుదల చేయనున్నారు.

మహిళా ఓటర్లే అధికం

మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 మండలాల్లోని 441 పంచాయతీల్లో 5,16,062 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. పంచాయతీలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 2,57,477 మంది ఉండగా.. మహిళా ఓటర్లు 2,58,578మంది, ఇతర ఓటర్లు ఏడుగురు ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 1,101మంది ఎక్కువగా ఉన్నారు. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ఆయా పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. పంచాయతీల్లో నిధుల లేమి అంశం ప్రత్యేకాధికారులకు తలనొప్పిగా మారడంతో అధికారులు అటువైపు చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం సమావేశాలకే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది.

మహబూబ్‌నగర్ జిల్లాలో ఓటర్ల వివరాలు..

జిల్లాలోని అడ్డాకుల మండలంలో 24,148, బాలానగర్‌లో 32,910, భూత్పూరులో 26,357, చిన్నచింతకుంటలో 37,474, దేవరకద్రలో 45,956, గండీడ్‌లో 61,577, హన్వాడలో 39,332, జడ్చర్లలో 40,237, కోయిలకొండలో 50,840, మహబూబ్‌నగర్ రూరల్‌లో 36,847, మిడ్జిల్‌లో 24,770, మూసాపేటలో 21,305, నవాబ్‌పేటలో 52,708, రాజాపూల్‌లో 21,601 ఓటర్లు ఉన్నారు.

రిజర్వేషన్లు మాకంటే మాకు..

ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడ చూసినా రిజర్వేషన్లపైనే చర్చ జరుగుతోంది. మాకంటే మాకు వస్తుందంటూ ఆశావహులు ప్రచారం చేసుకుంటున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్లపై ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు ఒకే రిజర్వేషన్లు ఉండేలా చట్టం తీసుకొచ్చింది. దీంతో 2019లో జరిగిన రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తేలా..? లేదా కొత్త పద్ధతిలో నిర్వహిస్తేలా.? అనేది తేలాల్సి ఉంది.

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ ప్రత్యేకాధికారులు, సిబ్బంది

గురుకుల ఉపాధ్యాయుల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్
- మహబూబ్‌నగర్‌లోని మైనార్టీ బాలుర-2 గురుకుల విద్యాలయం వద్ద నిరసన

మైనారిటీ బాలుర-2 గురుకులం వద్ద నిరసన తెలుపుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యా విభాగం, సెప్టెంబర్ 19 : గురుకుల ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలుర-2 గురుకుల విద్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి అధ్యాపకులు, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మైనార్టీ గురుకుల విభాగ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ షేక్ జావిద్ మాట్లాడుతూ అశాస్త్రీయంగా ఉన్న టైంటేబుల్ గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతోందని వాపోయారు. వెంటనే టైం టేబుల్ మార్చాలన్నారు. గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్, గురుకుల జేఏసీ సంయుక్తంగా నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళా ఉపాధ్యాయులతో రోజూ రాత్రి 9 గంటల వరకు పనిచేయించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఉద్యోగైనా ఆ సమయం వరకు పనిచేస్తున్నారా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కిష్టయ్య, మైనార్టీ బాలుర-2 గురుకుల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లుబీనా వహీదా అలీ జాబ్రి, రమా, అత్తర్‌జబీన్, తయ్యబా ఫిర్దోస్, సునీత, మహేశ్‌బాబు, అలీ అహ్మద్, షాహీన్, ఇస్రత్, విక్టోర్ ఆర్నాల్డ్, వెంకటమ్మ, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు, సుల్తానా, శ్రీను, మమత, నాగరాణి, అరుణ, రమాదేవి పాల్గొన్నారు.